ఆంధ్రజ్యోతి ప్రవాస

# అమెరికాలో మహాత్మునికి సీఎం నివాళి



డాలస్: అమెరికా పర్యటనలో ఉన్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు... ప్రవాస సంఘాల ప్రతినిధులతో కూడా సమావేశమవుతున్నారు. జన్మభూమి రుణం తీర్చుకునేలా ప్రవాసులను ప్రోత్సహించేందుకు ఎన్నారైలతో ప్రత్యేక కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ మెమోరియల్ చైర్మన్ డాక్టర్ ప్రసాద్ తోటకూరతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. టెక్సాస్‌లో ఉన్న అమెరికాలోనే అతి పెద్ద మహాత్మా గాంధీ మెమోరియల్‌ను మే 6, 2017 న సందర్శించి జాతిపిత మహాత్మా గాంధీకి నివాళులు అర్పించారు.

మహాత్మా గాంధీ మెమోరియల్‌ను నిర్మించడంలో డాక్టర్ ప్రసాద్ తోటకూర చూపిన నాయకత్వ ప్రతిభను ముఖ్యమంత్రి అభినందించారు. ఇర్వింగ్ నగర మేయర్‌ను ఒప్పించి మిలియన్ డాల్లర్లతో ఐదు నెలల వ్యవధిలో నాలుగు సంవత్సరాలకుపైగా శ్రమించి మహోత్తర నిర్మాణాన్ని నెలకొల్పడానికి ఎంతో కష్టపడిన డాక్టర్ ప్రసాద్ తోటకూరను, ఎం.జి.ఎం.ఎన్.టి సభ్యులు రావు కల్వల, ఎంవిఎల్ ప్రసాద్, పీయూష్ పటేల్, జాన్ హామండ్, షబ్నమ్ మోడ్గిల్, సల్మాన్  ఫర్షోరి,జాక్ గధ్వాని, తైయబ్ కుండవాలా, కమల్ కౌశల్‌ను ముఖ్యమంత్రి కొనియాడారు. వరుస సమావేశాలతో ఎంతో తీరికలేకుండా ఉన్నా.. వీలు కల్పించుకుని మహాత్మా గాంధీ మెమోరియల్‌ను సందర్శించినందుకు చంద్రబాబుకు, ఆర్థిక శాఖ మంత్రి యనుమల రామకృష్ణుడికి, ప్రభుత్వ మీడియా సలహాదారులు పరిటాల ప్రభాకర్‌కు, ఏ.పి.ఎన్.ఆర్.టి సీఈఓ డాక్టర్ రవి వేమూరుకు, ఇతర ప్రభుత్వ ప్రతినిధులు అందరికి  ప్రసాద్ తోటకూర ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

వివిధ దేశాల్లో ఉన్న ప్రవాస తెలుగు వారు నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో ఎలా పాల్గొనవచ్చో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవాస తెలుగు వారితో నిరంతరం ఎలాంటి సంబంధాలు కలిగి ఉండాలో సూచిస్తూ ముఖ్యమంత్రికి ప్రసాద్ తోటకూర సుదీర్ఘ వివరాలతో కూడిన ఓ లేఖను అందజేశారు.